

విమాన సర్వీసులు పెంచాలి : ఎంపీ కోట

బెంగళూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు - మంగళూరు మధ్య విమాన సర్వీసులు పెంచాలని ఉడుపి-చిక్కమగళూరు బీజేపీ ఎంపీ కోట శ్రీనివాసపూజారి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామమోహననాయుడుకి లేఖ రాశారు. ఆదివారం మంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండు నగరాల మధ్య మరిన్ని విమాన సర్వీసులు నడపాలని కోరారు. ప్రస్తుతం ఇండిగో వారానికి 46, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ 17 ట్రిప్‌లు కలిపి మొత్తం 63 సార్లు తిరుగుతున్నాయన్నారు. మరిన్ని సర్వీసులు పెంచేందుకు ప్రయత్నిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారన్నారు.

విద్యుత్ దీపాలకు మరమ్మతులు



సమరసౌధ..!

- నేటి నుంచి సువర్ణసౌధలో శీతాకాల సమావేశాలు
- అస్త్రాలు సిద్ధంచేస్తున్న ప్రతిపక్షం
- వక్ఫ్, ముడా అవినీతిపై నిలదీతకు సిద్ధం
- తిప్పికొట్టే వ్యూహంతో కాంగ్రెస్ కసరత్తు

బెంగళూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలం తర్వాత ప్రారంభమవుతున్న శాసనసభ సమావేశాలను వేదికగా చేసుకుని ప్రభుత్వ వైఫల్యాలు, వివిధ అవినీతి ఆరోపణలను అస్త్రాలుగా చేసుకుని సభా వ్యవహారాలను స్తంభింపచేసి తప్పులను అంగీకరించేలా చేయాలని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్‌లు సిద్ధమయ్యాయి. అయితే వారిని ఎదుర్కొనేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా సిద్ధమైంది. మూడు స్థానాలకు జరిగిన శాసనసభ ఉప ఎన్నికల విజయ ఉత్సాహంలో ఉన్న అధికార పార్టీ ప్రతిపక్షాల ఎత్తుగడలను తిప్పికొట్టేందుకు సిద్ధమయ్యింది. రెండు రోజులక్రితం జరిగిన కేబినెట్ సమావేశంలో సీఎం సిద్ధరామయ్య సహచర మంత్రులకు సభలో ప్రతిపక్షాలను ఎదుర్కొనే విషయంలో ధీటుగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ప్రతిరోజూ సభలో మంత్రులందరూ పాల్గొనాలని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతిపక్షాల ప్రశ్నాలకు భయపడరాదని సూచించినట్లు సమాచారం. ప్రధానంగా ముడా అవినీతి, వక్ఫ్‌బోర్డు రైతులకు నోటీసులు ఇవ్వడం వంటి వివాదాలపై సమగ్ర సమాచారం తెలుసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది.



తైలవర్ణ చిత్రాలను పరిశీలిస్తున్న స్పీకర్ యూటీ ఖాదర్

అభివృద్ధిపై చర్చ సాగేనా..?

సువర్ణసౌధలో ప్రారంభమయ్యే శాసనసభ శీతాకాల సమావేశాలు ఉత్తర కర్ణాటక అభివృద్ధిపై అర్థవంతమైన చర్చలకు వేదిక అవుతుందా... లేదా రాజకీయ సంఘర్షణలకు దారి తీయనుందా అనేది వేచి చూడాల్సి ఉంది. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో 97 కోట్ల రూపాయల నగదు బదిలీ జరిగిందని, గతంలో శాసనసభ సమావేశాల వేళ సీఎం సిద్దరామయ్య తెలిపారు. అయితే ఇదే అవినీతిలో మంత్రి పదవిని కోల్పోయిన నాగేంద్ర విషయంలో రెండు దర్యాప్తు సంస్థలు భిన్నంగా వ్యవహరించిన విషయాయంపై సభలో తీవ్రమైన వివాదం జరిగే అవకాశం ఉంది. సిట్ దర్యాప్తులో మాజీ మంత్రి నాగేంద్ర పేరు ప్రస్తావన లేకుండానే చార్జ్‌షీట్ నమోదైంది. కానీ ఈడీ నమోదు చేసిన చార్జ్‌షీట్‌లో అసలు సూత్రధారి నాగేంద్ర అని తేల్చింది. రాష్ట్ర, కేంద్రస్థాయి అధికారులు ఏ విధంగా విచారణ జరపారనేది స్పష్టమవుతోందని బీజేపీ చర్చకు డిమాండ్ చేసే అవకాశం ఉంది. వక్ఫ్ ఆస్తుల వివాదంపై బీజేపీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. వేలాదిమంది రైతులు వక్ఫ్ ఆస్తుల వివాదంలో బాధితులుగా మారుతున్నారు. ఇక సీఎం సిద్దరామయ్య కుటుంబం ముడా ఇంటి స్థలాల అవినీతి విచారణలు కీలక దశకు చేరుకున్నాయి. మరోవైపు మహారాష్ట్ర ఎన్నికల వేళ అబ్కారీశాఖలో 700 కోట్ల రూపాయల లంచాల ఆరోపణతోపాటు బళ్ళారిలో బాలింతల మృతి వంటి అంశాలు ప్రతిపక్షాలకు ప్రధాన అస్త్రాలుగా ఉన్నాయి.

ప్రతిపక్షాల అస్త్రాలివే...

- సీఎం కుటుంబంలో ముడా వివాదం
- రైతులకు వక్ఫ్ బోర్డు నోటీసులు.
- బళ్ళారిలో బాలింతల మృతి
- వాల్మీకి కార్పొరేషన్ అవినీతి
- బీపీఎల్ కార్డుల రద్దు
- ఈ-ఖాతా గందరగోళం
- కేఐఏడీబీ భూపంపిణీ అక్రమాలు
- వక్కలిగ స్వామీజీ చంద్రశేఖర నాథపై ఎఫ్ఐఆర్ నమోదు
- వివిధశాఖల్లో అక్రమాల, అవినీతి
- బెళగావి తహసీల్దారు కార్యాలయంలో ఉద్యోగి మృతి
- ఏడాదిన్నరగా కుంటుపడిన అభివృద్ధి
- ప్రగతికి నోచుకోని సాగునీటి ప్రాజెక్టులు

అధికార పార్టీ వ్యూహాలు

- బీజేపీ పాలనలో కొవిడ్‌కాలంలో సాగిన అవినీతి
- వక్ఫ్ ఆస్తులకు సంబంధించి బీజేపీ పాలనలో నోటీసుల అంశం
- యడియూరప్ప, కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు
- యడియూరప్పపై పోక్సో కేసు
- ఎమ్మెల్యే మునిరత్నపై ఆరోపణలు
- బీజేపీలో భిన్నాభిప్రాయాలు



● బీజేపీ ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నా అధికార కాంగ్రెస్‌కు మద్దతుదారులుగా ఎస్‌టీ సోమశేఖర్, శివరాం హెబ్బార్‌లు వ్యవహరిస్తున్నారు. ప్రతిపక్షాలలో విబేధాలను అనుకూలంగా మలచుకోవాలని అధికార కాంగ్రెస్ భావిస్తోంది. క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకొనే రాష్ట్ర బీజేపీలో గ్రూపు విబేధాలు తారస్థాయికి చేరాయి. విజయేంద్రను పార్టీ అధ్యక్షుడిగా అంగీకరించేది లేదని రెబెల్ నేతలు బసనగౌడ పాటిల్ యత్నాళ్, రమేశ్ జార్కిహొళి తదితరులు బహిరంగంగానే సభలు జరుపుతున్నారు. రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలతో సంబంధం లేకుండానే వక్ఫ్ వివాదంపై నెలరోజుల పోరాటానికి సిద్ధమైన విషయం తెలిసిందే. ఇలా బీజేపీలో రెండు గ్రూపులు ఉండడం వల్ల సమైక్యత ఉండదని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

సజావుగా సమావేశాలు: స్పీకర్

శాసనసభ శీతాకాల సమావేశాలను సజావుగా నిర్వహించి, ఓ మోడల్ అనిపించేలా నిర్వహించదలిచామని అందుకు సభ్యులు సహకరించాలని శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ పేర్కొన్నారు. ఆదివారం సువర్ణసౌధలో ఆయన మీడియాతో మాట్లాడారు. చారిత్రాత్మకమైన అనుభవమంటపం తరహా తైలవర్ణ చిత్రాల గ్యాలరీని ప్రారంభిస్తున్నామన్నారు. ఐదు బిల్లులపై సుదీర్ఘచర్చ జరగనుందన్నారు. ఇప్పటివరకు 3004 ప్రశ్నలు, 205 అంశాల ప్రస్తావన, 96 నియమాలు, 351 సూచికలను స్వీకరించామని, 3 ప్రైవేట్ బిల్లులు కూడా ఉన్నాయన్నారు. 2,500 మంది కార్యకర్తలు, సిబ్బంది సభా కార్యకలాపాల విధుల్లో పాల్గొంటున్నారని 6వేలమంది పోలీసులు బందోబస్తుకు కేటాయించబడ్డారన్నారు. సభ సజావుగా సాగడానికి సభ్యులు సహకరించాలన్నారు.



మీడియాతో..

జేడీఎస్‌లో కొరవడిన సమన్వయం

ఇక జేడీఎస్ పార్టీలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. గడిచిన శాసనసభ సమావేశాల సమయానికి పార్టీ శాసనసభాపక్షనేతగా కుమారస్వామి ఉండేవారు. ప్రస్తుతం ఆయన కేంద్ర కేబినెట్‌లో ఉండడంతో ఇక్కడ సమన్వయపరచడం అంత సులువు కాదనిపిస్తోంది. పార్టీ సీనియర్ నేత, కోర్ కమిటీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న జీటీ దేవెగౌడ కొన్ని నెలలుగా పార్టీ కలాపాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. బహిరంగసభలోనే సీఎం సిద్ధరామయ్యను కొనియాడుతూ కుమారస్వామి కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేస్తారా..? అంటూ వ్యాఖ్యానించారు. మరోవైపు హనూరు జేడీఎస్ ఎమ్మెల్యే మంజునాథ్ స్వయంగా సీఎం సిద్దరామయ్యను శనివారం చామరాజనగర జిల్లాలో జరిగిన సభలో పొగడ్తలతో ముంచెత్తారు. జేడీఎస్ పార్టీకి ప్రస్తుతం శాసనసభలో బలం 18కి తగ్గింది. వీరిలో కొందరు స్తబ్ధతగా ఉన్నారు. అందరినీ సమన్వయపరచడం అంత సులువు కాదనిపిస్తోంది. రాజకీయ ద్వేషాలు అనే అంశమే ప్రధానమైనదిగా మారే అవకాశాలు ఉన్నాయి. ముడా, వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ అవినీతి వివాదాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగప్రవేశాన్ని ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

15 బిల్లులకు సర్కారు సిద్ధం

శాసనసభ శీతాకాల సమావేశాలలో కనీసం 15 బిల్లులు ప్రవేశపెట్టేందుకు సర్కారు సిద్ధమైంది. ఇప్పటికే వాటికి సంబంధించిన ప్రక్రియను పూర్తి చేశారు. కలాపాలలో ప్రతిరోజూ బిల్లులు ప్రవేశపెట్టేందుకు ప్రాధాన్యం ఇచ్చారు.

ఉత్తర కర్ణాటకపై చర్చకు డిమాండ్

బెళగావిలో సువర్ణసౌధ నిర్మాణాలకు ప్రధాన కారణం వెనుకబడిన ఉత్తర కర్ణాటక జిల్లాల సమస్యలపట్ల దశాబ్దాలకాలంగా నిర్లక్ష్యం కొనసాగుతోందనేది, ఇదే కారణంతో బెళగావిలో సువర్ణసౌధ నిర్మాణం, ఏటా శాసనసభ శీతాకాల సమావేశాలు నిర్వహించేందుకు ఇదే ముఖ్యమైన అంశం. కానీ ఏటా జరిగే కార్యకలాపాలలో ప్రతిపక్ష సభ్యులు ఉత్తర కర్ణాటక అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేయడం, అధికార పార్టీ ఏదైనా తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించడం పరిపాటిగా మారుతోంది. అందుకు శాసనసభ స్పీకర్, పరిషత్ సభాపతులు సైతం అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇస్తున్నారు. కానీ ఆచరణలో అమలు కావడం లేదు. ఏటా పదిరోజులపాటు శాసనసభ సమావేశాలు జరగాల్సి ఉన్నా అఖిలభారత కన్నడ సాహిత్య సమ్మేళనం జరుగుతున్నందున ఒకరోజు కుదించారు. ముందుగానే ఉత్తర కర్ణాటక అంశాలపై చర్చిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కానీ రాజకీయంగా కీలక అంశాలపై చర్చలకే ప్రాధాన్యత ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి ఆదివారం సువర్ణసౌధలో మీడియాతో మాట్లాడుతూ కనీసం 4 రోజులు ఉత్తర కర్ణాటక అంశాలకు ప్రాధాన్యం ఇస్తానని ప్రకటించారు. కాగా నిరసనలకు సిద్ధమయ్యే సంఘాలు, విభాగాల సంఖ్య పెరుగుతోంది. గురువారం నాటికి 55 సంఘాలు నిరసనలకు సిద్ధం కాగా ఆదివారం నాటికి మరింత పెరిగాయి. పంచమసాలి లింగాయతలు 2ఏ రిజర్వేషన్ విషయంలో పోరాటం తీవ్రంగా ఉండాలని నిర్ణయించారు. ఏకంగా 10వేల ట్రాక్టర్లను సువర్ణసౌధ ప్రాంగణానికి తీసుకురావాలని నిర్ణయించారు.

తుంగభద్ర డ్యాం గేట్ ఏర్పాటుకు చర్యలు

● నేషనల్ డ్యాం అథారిటీ అధికారుల పరిశీలన



గేటును పరిశీలిస్తున్న డ్యాం సేఫ్టీ అధికారులు

6

మాంసాహార విందుకు బ్రేక్..!

● సాహిత్య సమ్మేళనంలో శాఖాహారానికే నిర్ణయం

అఖిలభారత కన్నడ సాహిత్య సమ్మేళనంలో మాంసాహార విందుకు బ్రేక్ పెట్టారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల రుచులు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 20 నుంచి మూడు రోజులపాటు 87వ సాహిత్య సమ్మేళనం మండ్యలో జరగనుంది.

7



పెంపుడు శునకంతో యువతి

సందడిగా పెట్ షో

నగరంలోని ప్యాలెస్ మైదానంలో పెట్‌ఫెడ్ సంస్థ నిర్వహించిన శునకాల ప్రదర్శన ఆకట్టుకుంది.

7

కాంగ్రెస్‌కు కంచుకోట సండూరు

● గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు ● నా సవాల్ స్వీకరించే ధైర్యం ప్రధానికి లేదు: సీఎం సిద్దరామయ్య



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య



హాజరైన ప్రజలు



ఎంపీ సంతోష్‌లాడ్

బళ్లారి, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): సండూరు ఎప్పటికైనా కాంగ్రెస్ కంచుకోటేనని, ఉప ఎన్నికల్లో గెలిపించిన ప్రజలను జీవితాంతం మరువలేనని సీఎం సిద్ధరామయ్య అన్నారు. ఆదివారం సండూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన భారీ ఓటరు సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని మోదీ అబద్ధాలకు కేరాఫ్‌గా మారారని, తన సవాల్‌ను స్వీకరించే ధైర్యం ఆయనకు లేదని మండిపడ్డారు. తనపై అవినీతి ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని మోదీకి సవాల్ విసిరారన్నారు. అయితే తన చాలెంజ్‌ని ఆయన స్వీకరించలేదన్నారు. ఎన్నికల సమయంలో మూడు రోజుల పాటు సండూరులో ప్రచారం చేశానని, తుకారం చేసిన అభివృద్ధి పనులను గమనించాను. కాంగ్రెస్ పాలనలోనే సండూరు అభివృద్ధి సాధ్యమయ్యిందన్నారు. రాష్ట్రంలో హామీలన్నింటినీ దశలవారీగా నెరవేరుస్తున్నామని, ప్రజల ఆర్థిక శక్తిని. కొనుగోలు శక్తిని పెంపొందించేలా కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. బీజేపీ పాలనలో మోదీ ఇచ్చిన హామీలను అటకెక్కించారన్నారు. దేశంలో ప్రతి పౌరుడు మోదీని ప్రశ్నించాలన్నారు. అచ్ఛేదిన్ తీసుకురాలేదు, ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదు. విదేశాల నుంచి ఉన్ననల్లధనం తీసుకురాలేదు. ఎవ్వరి ఖాతాలో 15లక్షలు వేయలేదన్నారు. అన్నీ నాటకాలే అని తేలిపోయిందన్నారు.

బళ్లారి జిల్లా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి గనులను దోచుకున్న జనార్ధనరెడ్డికి బీజేపీ ఎన్నికల సారథ్యం అప్పగించిందని, అయినా సండూరు ప్రజలు రెడ్డి ధనానికి, భయానికి, ప్రలోభాలకు అబద్ధాలకు లొంగలేదన్నారు. అన్నపూర్ణమ్మను గెలిపించడం ద్వారా సండూరు ప్రజలు అభివృద్ధికే మొగ్గు చూపారని అర్థమవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సండూరు ప్రజల కీర్తి మరింత పెరిగిందన్నారు. మూడు స్థానాల్లో విజయం సాధించి కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందన్నారు. తనపై తప్పుడు కేసులు, తప్పుడు ఆరోపణలు కుట్రలు పన్నిన బీజేపీకీ రాష్ట్ర ప్రజలు తగినగుణ పాఠం చెప్పారన్నారు. ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు ఎలాంటి కుట్రలకు, తప్పుడు కేసులకు భయపడే ప్రశ్నే లేదని సిద్ధరామయ్య పునరుద్ఘాటించారు. మృతిచెందిన బాలింతలకు రూ. 5లక్షలు పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎంపీ తుకారం, సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. సభకు భారీగా జనం తరలివచ్చారు.

ఆపరేషన్ దర్శన్..!

- 11తో ముగియనున్న దర్శన్ బెయిల్ గడువు
- సర్జరీ లేదంటే జైలుకు తప్పదా...?
- పలుమార్లు రెగ్యులర్ బెయిల్ పిటిషన్ తిరస్కరణ

బెంగళూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్యకేసులో బళ్ళారి జైలులో రిమాండ్ ఖైదీగా కొనసాగుతూ మెడికల్ గ్రౌండ్స్‌లో బెయిల్‌పై వచ్చిన నటుడు దర్శన్ పరిస్థితి ఏం కానుందనేది సర్వత్రా చర్చనీయాంశమయ్యింది. ఈనెల 11న బుధవారంతో దర్శన్‌కు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్ గడువు ముగియనుంది. తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నానని చికిత్స అవసరమని ఆయన కోరిన మేరకు ఆరు వారాలపాటు వైద్య చికిత్సల నిమిత్తం దర్శన్‌కు బెయిల్ మంజూరైన విషయం తెలిసిందే. ప్రస్తుతం దర్శన్ కెంగేరిలోని బిజిఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే ఇప్పటివరకు దర్శన్‌కు ఎటువంటి ఆపరేషన్ జరగలేదు. గడువులోగా శస్త్రచికిత్స జరగలేదంటే బెయిల్ రద్దు అయ్యే అవకాశం ఉంది. తాజాగా జరిగిన బెయిల్ విచారణలో దర్శన్ తరపు న్యాయవాది నాగేశ్ పలు విధాల వాదనలు చేశారు. దర్శన్‌కు బీపీ పెరుగుతోందని ఆపరేషన్ వెంటనే చేయడం సాధ్యం కాలేదని వివరించారు. అందుకు ప్రభుత్వం తరపు న్యాయవాది ప్రసన్నకుమార్ అభ్యంతరం తెలిపారు. దీంతో కోర్టు ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. విచారణ కొనసాగుతోంది. దర్శన్ మధ్యంతర బెయిల్‌పై బయటకు వచ్చిన నాటి నుంచి పలుమార్లు రెగ్యులర్ బెయిల్‌కోసం దరఖాస్తు చేసుకున్నారు.




నిఖిల్‌కు జేడీఎస్ రాష్ట్ర అధ్యక్ష కిరీటం?

- మరోసారి దేవెగౌడ కుటుంబానికే పీఠం..!
- పార్టీలో జోరందుకున్న చర్చలు
- కేంద్రమంత్రిగా కుమారస్వామి బిజీ.. బిజీ..

బెంగళూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జేడీఎస్ రాష్ట్ర అధ్యక్ష పదవికి నిఖిల్‌ను నియమించే కసరత్తు సాగుతున్నట్టు పార్టీ వర్గాలలో చర్చలు జోరందుకున్నాయి. దేవెగౌడ మనవడు, కుమారస్వామి తనయుడు నిఖిల్ క్రియాశీలక రాజకీయాల్లో ఉత్సాహంగా ఉన్నారు. దేవెగౌడ కుటుంబంలో మూడోతరంలో నిఖిల్ ఒక్కరే క్రియాశీలకంగా రాజకీయాల్లో ఉన్నారు. దీంతో నిఖిల్‌ను రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిని చేయాలని తీర్మానానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ సుముఖంగా ఉన్నట్లు సమాచారం. జేడీఎస్ పార్టీకి ప్రస్తుతం రాష్ట్రం అధ్యక్షుడిగా కుమారస్వామి ఉన్నారు. కేంద్ర భారీ పరిశ్రమలశాఖ మంత్రిగా కుమారస్వామి బిజీగా ఉన్నందున ఆ స్థానాన్ని మరొకరికి ఇవ్వాలని భావిస్తున్నారు. జేడీఎస్ పార్టీలో కీలక పదవులన్నీ దేవెగౌడ కుటుంబం చెంతనే ఉంటాయనేది తెలిసిందే. సుదీర్ఘకాలంగా దేవెగౌడ జేడీఎస్ జాతీయ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో కొంతకాలంపాటు కుమారస్వామి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించారు. కుమారస్వామి రాజకీయ వారసుడు, ఏకైక తనయుడు నిఖిల్ ప్రస్తుతం జేడీఎస్ యువ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఇబ్రహీం ఉండేవారు. బీజేపీతో జేడీఎస్ పొత్తు పెట్టుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించగా ఇబ్రహీంతోపాటు పార్టీ కార్యవర్గాన్ని సస్పెండ్ చేశారు. ఆ తర్వాత కుమారస్వామి తాత్కాలిక అధ్యక్షుడిగా నియమించారు. ప్రస్తుతం కుమారస్వామి కేంద్రమంత్రిగా కొనసాగుతున్నందున రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా సమయం కేటాయించలేకపోతున్నారు. 2019 మండ్య లోక్‌సభ స్థానం నుంచి, 2023లో రామనగర శాసనసభ స్థానం నుంచి ఓడిన నిఖిల్ ఇటీవల చన్నపట్టణ ఉప ఎన్నికల్లోనూ పరాజయం పాలయ్యారు. అయితే ఓటమిని సవాల్‌గా తీసుకుంటానని, రాజకీయాలనుంచి వెనుకడుగు లేదని నిఖిల్ ధీమాగా ప్రకటించారు. అందుకు తగిన పార్టీ పదవి ఉండాలని, నిఖిల్‌ను రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. నిఖిల్ మినహా దేవెగౌడ కుటుంబంలో మూడోతరం వారసులు లేరు. దేవెగౌడ మరో కుమారుడు హెచ్‌డీ రేవణ్ణ సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నా పార్టీ అధ్యక్ష స్థానాన్ని నిభాయించలేరని తెలిసిందే. రేవణ్ణ పెద్ద కుమారుడు సూరజ్ ఎమ్మెల్సీగా కొనసాగుతున్నా ఇటీవల హోమోసెక్స్ కేసులో జైలుపాలై బెయిల్‌పై బయటకు వచ్చాడు. ఇక మరో కుమారుడు ప్రజ్వల్ లైంగిక ఆరోపణలతో జైలులోనే ఉన్నాడు. దీంతో నిఖిల్‌కు క్రియాశీలక రాజకీయాలకోసం రాష్ట్ర అధ్యక్ష పదవిని కేటాయించాలని నిర్ణయించినట్లు సమాచారం.





తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.51	1,592.04
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	4,531	577
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	5,164	2,347
నీటి నిల్వ (టీఎంసీలు)	92.24	12.82

తుంగభద్ర డ్యాం గేట్ ఏర్పాటుకు చర్యలు

బళ్లారి సిటీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు వ్యవసాయ, తాగునీరు అందించే తుంగభద్ర డ్యాంకు ఏడిజైన్ క్రస్టిగేట్ ఏర్పాటు చేయాలనే అంశంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సీనియర్ అధికారులు చర్యలు ప్రారంభించారు. అథారిటీ చైర్మన్ అనిల్ జైన్, గేట్ డివిజన్ డైరెక్టర్ రాహుల్ కుమార్ సింగ్ ఆదివారం మధ్యాహ్నం తుంగభద్ర బోర్డు , నీటిపారుదల అధికారులు, ఇంజినీర్లతో చర్చించారు. శనివారం డ్యాం వద్దకు వెళ్ళి కొన్ని గేట్లను పరిశీలించిన సభ్యులు ఆదివారం మరోసారి సందర్శించి అన్ని గేట్ల పరిస్థితిని సమీక్షించారు. ఆ తర్వాత ఏరకమైన గేటు సరిపోతుందో నిర్ణయిస్తామని తెలిపారు. బృందంలో బెంగళూరు డ్యాం ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ్, హైదారాబాద్ చీఫ్ ఇంజనీర్ ముఖర్జీ, తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే. రెడ్డి తదితరులున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు అవగాహన శిబిరం

హోసూరు డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులకు నాణ్యతపై అవగాహన కల్పించే శిబిరాన్ని ఏర్పాటు చేశారు. హోసూరు బీడీఓ కార్యాలయంలో ఇండియన్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ బెంగళూరు శాఖ ద్వారా గ్రామ పంచాయతీ స్థాయిలో భారతీయ ప్రమాణాల వినియోగంపై అవగాహన శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి శాంతలక్ష్మి, వెంకటేశం పద్మావతి అధ్యక్షత వహించారు. మాజీ డైరెక్టర్ తామరైసెల్వన్ పాల్గొని మాట్లాడుతూ ఉత్పత్తులపై ఐఎస్ఐ ధృవీకరణను పరిశీలించుకోవాలన్నారు. ప్రస్తుతం 723 ఉత్పత్తులు బిఐఎస్ గుర్తింపు ఉన్నాయన్నారు. బిఐఎస్ కేర్ యాప్ సహాయంతో లోపమున్న ఉత్పత్తులపై ఫిర్యాదులను సులభంగా నమోదు చేయవచ్చునన్నారు. శిబిరంలో 26మంది గ్రామ పంచాయతీ పెద్దలు, హోసూరు జిల్లా కార్యదర్శులు, ఇండియన్ ఆర్గనైజేషన్ బెంగళూరు శాఖ ప్రతినిధి శివకుమార్, జిల్లా రిసోర్స్ ఇన్‌స్ట్రక్టర్ నికోలస్ ప్రకాశ్, జిల్లా రిసోర్స్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శులకు నాణ్యత ప్రమాణాలపై పుస్తకాలను పంపిణీ చేశారు.

వేధింపులు ఆపాలి

కంప్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భూగర్భజలశాఖ అధికారులు ఉద్దేశ పూర్వకంగా కంప్లిని టార్గెట్ చేసుకుని లారీలపై జరిమానాలు వేస్తున్నారని కే నిరీష ఆరోపించారు. ఆదివారం అతిథిగృహంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. రెండు రోజుల క్రితం తమ ఇసుక లారీని భూగర్భశాఖ అధిఅన్ని రశీదులు, అనుమతులున్నా జరిమానా విధించారన్నారు. లారీని స్వాధీనం చేసుకుని స్టేషన్లో ఉంచారని, ఆ విషయంపై భూగర్భశాఖ అధికారుల వద్దకు వెళ్లగా అక్కడ చంద్రశేఖర్ అనే అధికారి లారీ ఓనర్లపై దుర్భాషలాడారన్నారు. నిబంధనలు పాటిస్తున్నా అధికారులు ఇలా విరుచుకుపడడం తగదని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలానే కొనసాగితే ప్రతిఘటనలు, నిరసనలు చేపడతామని తెలిపారు.

మందుబాబులకు అడ్డాగా ఇందిరా క్యాంటీన్



నిరుపయోగంగా ఇందిరా క్యాంటీన్

కంప్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పేదలకు తక్కువ ధరకు టిఫిన్, ఆహారం అందించేందుకు పట్టణాలలో ఇందిరా క్యాంటీన్ ఏర్పాటు చేశారు. కానీ నెలలు గడుస్తున్నా ప్రారంభం కాకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయని కుడితిని పట్టణ సమాజసేవకులు ప్రగతిపర హోరాట సంఘం అధ్యక్షుడు కామేష్ ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు వృథా కావడంతోపాటు అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారుతన్నాయన్నారు. బస్టాండ్ సమీపంలోనే నిర్మించారని, అయినా ప్రజలకు ఉపయోగకరంగా లేవని అన్నారు. అధికారులు ఇప్పటికైనా అక్కడ క్యాంటీన్ ప్రారంభించి పేదల ఆకలి తీర్చాలన్నారు.

బాలింతల మృతిపై సమగ్ర విచారణ

● మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్

రాయచూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బళ్లారిలో బాలింతల మృతికి సంబంధించి ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించిందని రాష్ట్ర వైద్యకీయ శిక్షణ రాయచూరు జిల్లా ఇంచార్జ్ మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ పాటీల్ తెలిపారు. రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయంలో నిర్వహిస్తున్న కృషి మేలాలో పాల్గొనేందుకు ఆదివారం జిల్లాకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. బళ్లారి ప్రభుత్వ ఆస్పత్రిలో బాలింతల మరణానికి సంబంధించి సమగ్ర విచారణ కోసం ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని, ఎండోడాక్సిన్ వల్లే మృతి సంభవించినట్లు ప్రాతమిక నివేదికలో ఉందన్నారు. కాగా ఇందుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులున్నా పరిశీలించేందుకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. దీంతో పాటే జిల్లాలోను ఇలాంటి బాలింతల మరణాలు ఎక్కడ సంభవించినా బాధ్యులను వదిలే ప్రసక్తి లేదన్నారు. జిల్లా కేంద్రంలోని ఓపెక్ ఆస్పత్రిని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టిందన్నారు. కేన్సర్ విభాగాన్ని ప్రారంభించనుందని శస్త్ర చికిత్సకు అవసరమైయ్యే వైద్యుల నియామకానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలున్న ఓపెక్ ఆస్పత్రిలో పేదలకు మరింత మెరుగైన వైద్యసౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు.

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట

● మంత్రి చలువరాయస్వామి



మేళాను ప్రారంభిస్తున్న మంత్రి చలువరాయస్వామి

రాయచూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ అభివృద్ధికి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయస్వామి అన్నారు. నగరంలోని రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయంలో నిర్వహిస్తున్న మూడు రోజుల కృషి మేళలో భాగంగా రెండవ రోజు ఆదివారం కృషి మేళాలో పాల్గొన్న మంత్రి, వ్యవసాయ రంగంలో ఆధునీకీకరణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. సాగు ఖర్చును తగ్గించడం రైతు లాభాలను పెంచడమే లక్ష్యంగా యంత్రీకరణ వైపు మొగ్గు చూపినట్లు తెలిపారు. రైతులకు యంత్రాలపై సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. మేళాలు రైతుల ప్రయోజనాలు కాపాడేలా ఉండాలన్నారు. మేళాలో జరిగే చర్చలు రైతు సమస్యల పరిష్కారానికి వేదికలుగా నిలవాలన్నారు. అదే సమయంలో రైతులను ఆధునిక సాంకేతికతవైపు మళ్లించేందుకు మేళాలు మార్గదర్శకం కావాలన్నారు. పంట ఉత్పత్తులకు తగిన మార్కెట్ దర కల్పించడం ద్వార రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తెలిపారు. రైతుల డిమాండ్ మేరకు ఈ ఏడాది 2024 నియోజక వర్గాల్లో కృషి హొండల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ గురించి మాట్లాడేందుకు విజయేంద్ర ఎవరు..?

కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, ముఖ్యమంత్రి అధికార పంపకాల గురించి మాట్లాడేందుకు విజయేంద్ర ఎవరని మంత్రి చళువరాయస్వామి సూటిగా ప్రశ్నించారు. విలేకరులతో మాట్లాడిన మంత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడుడిగా ఉన్న విజయేంద్ర తమ పార్టీ అంతర్గత వ్యవహారాలకే పరిమితం కావాలని కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో తలదూర్చాల్సిన అవసరం లేదన్నారు. రైతుల గురించి వక్ఫ్‌బోర్డు గురించి మాట్లాడే నైతిక అర్హత బీజేపీకి లేదని మంత్రి స్పష్టం చేశారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో 205 మంది రైతులకు నోటీసులు వచ్చాయని వాటిని తమ ప్రభుత్వం అధికారంలో కొచ్చిన వెంటనే ఉపసంహరించుకున్నట్లు మంత్రి వెల్లడించారు. రైతుల పట్ల నిబద్ధత నిజమైన ప్రేమ ఎవరికుందో దిన్నిబట్టి అర్థం చేసుకోవచ్చన్నారు.



మేళాను తిలకిస్తున్న ప్రజలు

కొనుగోలు కేంద్రాల పేరుతో ప్రభుత్వం డ్రామా

● రైతుల పేర్లు కూడా నమోదు చేసుకోలేదు: మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప ఆగ్రహం

సిరుగుప్ప, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పేరుకు మాత్రమే వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారేతప్ప ఇంతవరకు వరిధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప విమర్శించారు. ఆదివారం టెక్కలకోట పట్టణంలో విలేకరుల సమావేశంలో సోమలింగప్ప మాట్లాడారు. వారం రోజుల కిందట వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. అయితే ఇంతవరకు రైతుల పేర్లు కూడా నమోదు చేసుకోకపోవడం ఆశ్చర్యంగా వుందన్నారు. తాలుకాలో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయని దుయ్యబట్టారు. టెక్కలకోట పట్టణంలో వాల్మీకి భవనం రూ. 3 కోట్లతో నిర్మించినా ఇంతవరకు పట్టణపంచాయతీకి అప్పగించకపోవడంతో దుమ్ముధూళితో నిండిపోయిందన్నారు. బలకుంది, ముదియనూరు బ్రిడ్జి కమ్ బ్యారేజీ ఏర్పాటు చేసినా గేట్లు ఏర్పాటు చేయకపోవడంతో 1.5 టీఎంసీల నీరు వృథాగా కిందకు వెళుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిరుగుప్పపట్టణంలో రూ. 3 కోట్లతో చేపట్టిన అంబేడ్కర్ భవనం పూర్తయినా ఇంతవరకు ప్రారంభించకపోవడం ప్రభుత్వ వైఫల్యమన్నారు. రైతులకు వర్షం కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం కూడా కల్పించలేదన్నారు. తక్షణమే రైతులకు నష్టపరిహారం కల్పించాలన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజాసమస్యలపై నిర్లక్ష్యధోరణి అవలంభిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా టెక్కలకోట పట్టణ పంచాయతీ బీజేపీ ప్రముఖ నాయకులు హెచ్‌కే తిమ్మప్ప, కొమరప్ప, సిద్దనగౌడ, మారుతి, వీరేష, రాఘవేంద్ర, సిద్దయ్య, జడే మల్లికార్జున, వెంకటేష్, గురుసిద్దప్ప, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

పోషకాహారంతో కళ్లు భద్రం

బళ్లారి సిటీ,డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పోషక విలువలున్న పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, విత్తనాలు, పీతలు చేపలు తినడం ద్వారా దృష్టిలోపం నయం అవుతుందని కర్ణాటక రాష్ట్ర టీచర్స్ ఫోరం జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. తాలూకాలోని సంజీవరాయన కోట ప్రభుత్వ పాఠశాల, శిడిగినమోల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జ్ఞానేంద్రియాల్లో కంటికి అత్యంత ప్రాధాన్యం ఉందని, ప్రపంచాన్ని మనకు చూపే కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. దృష్టిలోపం ఉన్న పిల్లలు పుస్తకాన్ని దగ్గర పెట్టుకుని చదువుతూ తలనొప్పి , మెల్లకన్నుతో బాధపడుతున్నారు. దీనికి కారణం వంశపారంపర్యత, దూమపాన, అతిగాటీవీ, మొబైల్, కంప్యూటర్ చూడడమే నన్నారు. సీనియర్ హెల్త్ అసిస్టెంట్ దినేశ్ మాట్లాడుతూ సాదారణ వ్యాయామాలు, గుడ్లు, పాలు, అరటిపండ్లు, పచ్చిమిర్చి తినడం ద్వారా కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఈసందర్భంగా హెల్త్ అసిస్టెంట్ విజయలక్ష్మి. టీచర్ గురుప్రసాద్, అంగన్‌వాడీ నింగమ్మ , ఆశా వర్కర్ సుశీల తదితరలు పాల్గొన్నారు.



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న రవిచెళ్లగుర్కి, హెల్త్ ఆఫీసర్లు



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బాధితులకు పరిహారం పంపిణీ

బళ్లారి సిటీ, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): బళ్లారి మహానగర పాలికె పరిధిలోని 7,8 వార్డు బాపూజీ నగర్‌లో రోడ్డు విస్తరణలో పూర్తిగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు పరిహారం అందజేశారు. ఆదివారం 12 మందికి సిటీ ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి ఒకొక్కరికి రూ. 50వేలు పరిహార చెక్కులను అందజేశారు. లబ్దిదారులు లక్ష్మి, హులియమ్మ, మీనాక్షి, రత్నమ్మ, గంగమ్మ, మారెమ్మ, శివమ్మ, వందనా, గంగమ్మ,సరస్వతి, విద్యాశ్రీ చెక్కులు అందుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రాల్ సమీపంలో ఇప్పటికే ప్రభుత్వ స్థలాన్ని గుర్తించామని, ఇళ్లు కోల్పోయిన 12మందికి మున్సిపల్ కార్పోరేషన్, సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా త్వరలో నిర్మించి ఇస్తామన్నారు. ఈసందర్భంగా కార్పోరేషన్ సభ్యుడు రామాంజనేయులు, కాంగ్రెస్ నాయకులు, ఎ.మానయ్య, శివరాజ్, శంకర్, నాగేంద్రప్ప, వ్యాప్యారి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



డాక్టర్ ఉరుకుందను సన్మానిస్తున్న ఉప్పర సమాజ సభ్యులు

బళ్లారిరూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏసియా అంతర్రాష్ట్రీయ సంశోధన ఆధ్వర్యంలో డాక్టరేట్ పొందిన ఉరుకుంద రెడ్డికి ఉప్పర సమాజం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డాక్టర్ ఉరుకుందప్ప మాట్లాడుతూ కరోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ఉత్తమ సేవలందించడంతో విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కర్ణాటక మానవ హక్కులను రాజ్యాధ్యక్షురాలు డాక్టర్ ఉరుకుంద రెడ్డిని సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బళ్లారి నగర భగీరథ ఉప్పర సేవా ట్రస్టు అధ్యక్షుడు అంజనేయులు, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, కార్యదర్శి వెంకటరాముడు, బళ్లారి తాలుకా నౌకర సంఘ అధ్యక్షుడు ఉప్పర మల్లప్ప, అశ్విని యాదవ్, నాగమణి, లక్ష్మీ, అడ్వకేట్ కాలింగ, హేమంత్ రాజు, ప్రసాద్, పెద్దఎత్తున కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

కనకదాస సేవలు అపారమైనవి



ప్రముఖులను సన్మానిస్తున్న కన్నడ సాహిత్య పరిషత్ పదాధికారులు

తోరణగల్లు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హోబలీ ఘటక ఆధ్వర్యంలో తోరణగల్లు స్టేషన్‌లోని బసవేశ్వర గ్రామాంతర పాఠశాల ఆవరణలో దత్తి ఉపన్యాస కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు సిద్దలింగప్ప మాట్లాడుతూ కన్నడ సాహిత్యానికి కనకదాసు చేసిన సేవలు అపారమైనవన్నారు. కనకదాసు గొప్ప భక్తుడని ఆయన కన్నడ రచనలు ఎందరికో స్ఫూర్తినిచ్చాయన్నారు. కన్నడ సాహిత్య పరిషత్ తోరణగల్లు హోబలీ ఘటక అధ్యక్షుడు ఆర్‌బీ నాయక్ మాట్లాడారు. అనంతరం బళ్లారి భవాని లలిత కళా మహా విద్యాలయ ప్రముఖులు, జిల్లా సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కేవీ సిద్దలింగప్పను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ముఖ్య గురువులు దరియప్ప రాథోడ్, కన్నడ శిక్షకులు హెచ్ ఎం ఉమ, ప్రముఖ సాహితీవేత్తలు అబ్దుల్ హై వకీల్, రాజశేఖర్ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు ఇతర పాఠశాల సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బళ్లారి భవాని లలిత కళా మహా విద్యాలయ ప్రముఖులు ఎల్‌ఆర్ జాదవు అలా జిల్లా సాహిత్య పరిషత్ అధ్యక్షులు సిద్దలింగప్పను సన్మానించారు.

పేట బసవేశ్వర, నీలమ్మ దేవి కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కంప్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టనంలో ప్రసిద్ధి గాంచిన పేట బసవేశ్వర, నీలమ్మ దేవి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. పేట బసవేశ్వర స్వామి తరఫున అలబనూరు బసవరాజు, నీలమ్మ దేవి తరఫున మర్రిశెట్టి విజయ్‌కుమార్ పాల్గొని కల్యాణం నిర్వహించారు. అంతకుముందు పేట బసవేశ్వర, నీలమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమాన్ని అర్చకులు సిద్దరామేశ్వర శాస్త్రి, చంద్రశేఖరయ్యస్వామి ఘనంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్

కంప్లి, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): అన్ని సమాజాలతో పాటు అలేమారి బుడకట్టు సమాజానికి మూడు శాతం రిజర్వేషన్లు పెంచాలని ఎస్సీ, ఎస్టీ అలేమారి, బుడకట్ట మహాసభ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ కోరారు. ఆదివారం కుడితిని పట్టణంలో మూడవ వార్డులో అలేమారి సమాజం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సుమారు 49 సూక్ష్మాతిసూక్ష్మ అలేమారి వర్గాలున్నాయన్నారు. రిజర్వేషన్ల పెంపుతోనే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. బెళగావిలో జరగనున్న శీతాకాల సమావేశాల్లో రిజర్వేషన్ల అంశంపై చర్చించాలని చలో బెళగావి చేపడ్తామన్నారు. అనంతరం అలేమారి సమాజప్రముఖులు సవంత్‌కుమార్ మాట్లాడుతూ అలేమారి బుడకట్టు సమాజాన్ని ప్రభుత్వం గుర్తించి శిక్షణ, ఆర్థిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, తిప్పేస్వామి, ఉమేష్, లాలెప్ప, రెడ్డప్ప, మారేష్, వీరేష్, శంకరప్ప, చిన్నదాసర దుర్గప్ప, జంబణ్ణ, గిరియప్ప, లింగరాజు, శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న అలేమారి, బుడకట్టు సమాజ పదాధికారులు

హోసూరు జోన్



పుస్తకావిష్కరణలో పాల్గొన్న రచయితలు, కవులు

గురజాడ పుస్తకావిష్కరణ

హోసూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంఘసంస్కర్త, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గురజాడ అప్పారావు రచనల గ్రంథం 'వసివాడని సాహిత్యం నీ పేరేమిటి' పుస్తకావిష్కరణ నగరంలోని ఆంధ్ర సాంస్కృతిక సమితి భవనంలో ఆదివారం జరిగింది. సంస్థసహ అధ్యక్షుడు, గురజాడ మనవడు డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ 'దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులోయ్' అనే నినాదం ప్రజలను చైతన్యం కల్పించారన్నారు. కార్యక్రమానికి రిటైర్డు ఉపాధ్యయులు చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా ఎం.ఎస్.రామస్వామి రెడ్డి, ముత్తుకృష్ణన్, సాంస్కృతిక సమితి అధ్యక్షులు రామచంద్ర, కార్యదర్శి విశ్వనాథం, రాష్ట్రసమాఖ్య సభ్యులు కృష్ణప్ప, సీతారాం, కృష్ణరసం అధ్యక్షులు డాక్టర్ అగరం వసంత్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులను, అమరనారా బసవరాజులను సత్కరించారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత నేత్రవైద్య శిబిరం

హోసూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): హోసూరు సిఫ్‌కాట్ రోటరీ క్లబ్ ఎలైట్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర పరీక్ష చికిత్సా శిబిరం జరిగింది. శిబిరానికి చిన్నయళసగిరి ప్రైవేట్ మెట్రిక్యులేషన్ స్కూల్ బాలాజీనగర్, హోసూరు సిఫ్‌కాట్ రోటరీ క్లబ్, హోసూరు ఎలైట్ రోటరీ క్లబ్ సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, కృష్ణగిరి డిస్ట్రిక్ట్ సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ బ్లైండ్‌నెస్ సహకారం అందించాయి. సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల హాస్పిటల్ నుంచి నేత్ర వైద్య నిపుణుడు రీతు నేతృత్వంలోని బృందం పాల్గొని పరీక్షలు, చికిత్సలు అందించారు. రక్తపోటు, షుగర్ లెవెల్‌ను పరిశీలించారు. అవసరమైనవారికి సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు ఉంటాయని తెలిపారు. చిన్న ఎళసగిరి ఆనంద నగర్, బాలాజీనగర్, కేసీసీ నగర్, మీనాక్షీనగర్, సిఫ్‌కాట్ ప్రాంతాలకు చెందిన వృద్ధులు తదితరులు 76 మంది పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు. 20 మందికి కంటిశుక్లం ఉన్నట్లు గుర్తించి శస్త్రచికిత్సలు అవసరమని సిఫారసు చేశారు. శిబిరాన్ని సమన్వయ కర్తలు సుబ్బారావు, రాజు పర్యవేక్షించారు. సిఫ్‌కాట్ రోటరీ క్లబ్ ఎలైట్ రోటరీ క్లబ్ కార్యవర్గ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

మల్లంపల్లి సోమశేఖర శర్మ (జయంతి)




సుప్రసిద్ధ తెలుగు చారిత్రక పరిశోధకులు, పురాలిపి శాస్త్ర జ్ఞుడు మల్లంపల్లి సోమశేఖర శర్మ 1891 డిసెంబరు 9న పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం మినిమించిలిపాడు గ్రామంలో జన్మించారు. విజ్ఞాన సర్వస్వం ద్వారా వెలుగులోకి వచ్చిన సోమశేఖర శర్మ డిగ్రీలు లేని పండితుడే అయినా నేటికీ నాటికీ ఆంధ్ర చరిత్రకారుల్లో అగ్ర తాంబూలానికే అర్హత సాధించిన పరిశోధక శిఖామణి. సాహితీ రంగంలో, రాజకీయ రంగంలో పేరొందారు. సేకరించిన శాసనాలను ఎపిగ్రాఫియా ఇండియా, భారతి, శారద, ఆంధ్రపత్రిక వంటి పత్రికల్లో వ్యాసాలు రాశారు. 80కుపైగా శాసనాలను లఘువ్యాఖ్యలు ప్రచురించారు. 1963లో కన్నుమూశారు.

వీ దక్షిణామూర్తి అయ్యర్ (జయంతి)



కర్ణాటక సంగీత విద్వాంసులు, స్వరకర్త వెంకటేశ్వరన్ దక్షిణామూర్తి అయ్యర్ 1919 డిసెంబరు 9న ట్రావెన్‌కోర్‌లో జన్మించారు. మళయాళం, తమిళం, హిందీ సినిమాలకు సంగీత దర్శకుడిగా వ్యవహరించారు. స్వామిగా చిరపరిచితులు. 125 సినిమాలకు సుమారు 1400 పాటలకు కంపోజ్ చేశారు. పీ లీల, సుశీల, కల్యాణి మీనన్, ఇళయరాజా వంటి వారికి ఆయన గురువు. సంగీతసరస్వతి అవార్డు, ఉత్తమ సంగీత దర్శకుడిగా కేరళ రాష్ట్ర ఫిల్మ్ అవార్డ్, గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. 2013 ఆగస్టు 2న కన్నుమూశారు.

బాబ్ హాక్ (జయంతి)



ఆస్ట్రేలియా దేశ ప్రధానమంత్రిగా వ్యవహరించిన రాబర్ట్ జేమ్స్ లీ హాక్ 1929 డిసెంబరు 9న సౌత్ ఆస్ట్రేలియాలో జన్మించారు. లేబర్ పార్టీ అధ్యక్షుడిగా 1983 నుంచి 1991వరకు కొనసాగారు. సుదీర్ఘ కాలం సేవలందించిన మూడవ ప్రధానిగా పేరొందారు. రిటైరయ్యాక వ్యాపారంలో రాణించడమే కాక సమాజసేవలోనూ చురుగ్గా పాల్గొనేవారు. అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా తనదైన గుర్తింపు పొందారు. 2019 మే 16న కన్నుమూశారు.

సోనియాగాంధీ (పుట్టినరోజు)



సోనియాగాంధీ 1946 డిసెంబరు 9న ఇటలీలో జన్మించారు. రాజీవ్ గాంధీని వివాహం చేసుకున్నారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్యకు గురైన కొంత కాలానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్ష పదవి పగ్గాలు చేపట్టారు. ఎటువంటి ప్రభుత్వ హోదాలో కొనసాగనప్పటికీ దేశంలో ప్రముఖ రాజకీయ నాయకురాలిగా పేరొందారు. గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. అంతర్జాతీయ స్థాయిలో టైమ్స్ వెలువరించిన 2007, 2008లో టాప్ వంద ప్రభావశీలురులో ఒకరిగా, 2010లో టాప్ 50లో ఒకరిగా నిలిచారు. ఆమె పిల్లలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలు రాజకీయాల్లో రాణిస్తున్నారు.

రహత్ ఫతే అలిఖాన్ (పుట్టినరోజు)



రహత్ ఫతే అలిఖాన్ 1974 డిసెంబరు 9న జన్మించారు. మేనమామ, ఖవ్వాలీ గాయకుడు నుస్రత్ ఫతే అలిఖాన్ వద్ద ఏడవ ఏటనుంచే శిక్షణ పొందారు. 15వ యేటనుంచి నుస్రత్‌తో కలసి ప్రపంచవ్యాప్తంగా పర్యటించి కచేరీలలో భాగస్వామ్యులయ్యారు. బాలీవుడ్‌తోపాటు పాకిస్థానీ సినీరంగంలోనూ నేపథ్య గాయకుడిగా పేరొందారు. గజల్స్ ఆలాపన ప్రత్యేకం. బుల్లితెరపై సంగీత కార్యక్రమాలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

కార్యసాధకుడు చైతన్యమహాప్రభు: గవర్నర్

బెంగళూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చైతన్య మహాప్రభు ఓ లక్ష్యంతో ఇస్కాన్‌ను రూపకల్పన చేశారని ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక, సామాజిక సేవలలో కోట్లాదిమందికి ఆదర్శంగా కొనసాగుతోందని గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ అభిప్రాయపడ్డారు. ఆదివారం రాజాజినగర్‌లోని ఇస్కాన్ మందిరంలో చైతన్యమహాప్రభు గురించి తొలి కన్నడ పుస్తకాన్ని ప్రముఖ కన్నడ కవి, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ నా మొగసాలె 'విశ్వంభర' పేరిట రచించారు. పుస్తకావిష్కరణలో వ్యాసరాజ మఠం విద్యాశ్రీశతీర్థ, ఇస్కాన్ మైసూరు అధ్యక్షుడు శ్లోకకృష్ణ స్వామి, కర్ణాటక సంస్కృత విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ మల్లేపురం వెంకటేశ్, ప్రముఖ నటుడు దర్శకుడు ప్రకాశ్ బెళవాడి, ఇస్కాన్ బెంగళూరు సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ చంచలపతిదాసలు పాల్గొన్నారు. విశ్వాన్ని రక్షించేవారనే అర్థం వచ్చేలా విశ్వంభర పేరిట పుస్తక రచన చేశారని గవర్నర్ అభిప్రాయపడ్డారు. మూడు దశాబ్దాలుగా చైతన్య మహాప్రభు ఆశయాల పరంపరతో సనాతన ధర్మప్రచారం చేస్తున్న మధుపండితదాస, చంచలపతి దాసలను అభినందిస్తున్నానన్నారు.



విశ్వంభర పుస్తకావిష్కరణలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ తదితరులు

మొబైల్ ప్లానెటోరియాన్ని వీక్షించిన విద్యార్థులు



ప్లానెటోరియం వద్ద విద్యార్థులు తదితరులు

శిడ్లఘట్ట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తారె జమీర్ పర్ సంస్థ ఆధ్వర్యంలోని మొబైల్ ప్లానెటోరియంను విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు. ఆర్‌సిజి బాలాజి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శిడ్లఘట్ట పట్టణంలోని వాసవి విద్యాసంస్థ ఆవరణలో మొబైల్ ప్లానెటోరియం ఏర్పాటైంది. పాఠ్యపుస్తకాలలోని సూర్యమండలం, నక్షత్రాలు, గ్రహాల అంశాలను స్వయంగా ప్లానెటోరియం ద్వారా వీక్షించారు. సంచారవాహనంలో త్రీడీ డిజిటల్ రూపంలో వీక్షించే అవకాశం కల్పించారు. ఖగోళశాస్త్రంలోని అంశాలను వివరించారు. ఎమ్మెల్సీ ఛలవాది నారాయణస్వామి కూడా స్వయంగా వీక్షించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీకల్ ఆనందగౌడ మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామీణ విద్యార్థులకు ప్లానెటోరియం వీక్షించే అవకాశాన్ని కల్పిస్తామన్నారు. వాసవి విద్యాసంస్థ అధ్యక్షుడు కృష్ణయ్యశెట్టి, పాలనాధికారి రూపసి రమేశ్, సురేంద్రగౌడ, ఆంజనేయరెడ్డి, నగరసభ సభ్యుడు నారాయణస్వామి, తారెజమీన్‌పర్ సంస్థకు చెందిన శిరీష్ మహాజన్, పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

మాంసాహార విందుకు బ్రేక్

బెంగళూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): అఖిలభారత కన్నడ సాహిత్య సమ్మేళనంలో మాంసాహార విందుకు బ్రేక్ పెట్టారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల రుచులు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 20 నుంచి మూడు రోజులపాటు 87వ సాహిత్య సమ్మేళనం మండ్యలో జరగనుంది. సాహిత్య సంబరానికి ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఉత్తర కర్ణాటక, దక్షిణ కర్ణాటక శైలి రుచులు అందుబాటులో ఉంచనున్నారు. సమ్మేళనానికి విచ్చేసే ప్రముఖులు, సభ్యులు, వలంటీర్‌లు, మీడియా, పోలీసు సిబ్బంది కనీసం 3లక్షలమందికిపైగా వస్తారని అంచనా వేశారు. ఇందుకు 4 ప్రత్యేక ప్రదేశాలలో 300 కౌంటర్లను సిద్ధం చేస్తున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం కల్పించనున్నారు. 350మంది వంట మనుషులు, 900మంది ఆహార సరఫరా చేసే వారిని సిద్ధం చేశారు. కౌంటర్ల పర్యవేక్షణకు ప్రత్యేక సిబ్బందిని కేటాయించారు. వేర్వేరు కౌంటర్లను సిద్ధం చేస్తున్నారు. నాణ్యత, రుచికి ప్రాధాన్యత ఇవ్వదలిచారు. ప్లాస్టిక్ రహిత సమ్మేళనం నిర్వహించదలిచారు. అల్పాహారంలో ఇడ్లి, వడ, ఉప్మా, మైసూరు పాక్, మధ్యాహ్న భోజనంలో ఓళిగ, జొన్న రొట్టెతోపాటు అన్నం, సాంబారు, ఇతరత్రా కూరలు, రాత్రి భోజనానికి పూరి, సాగు, మైసూరు పాక్, వివిధకూరలతోపాటు రైస్‌బాత్, పెరుగన్నం ఉండనుంది. ప్రతిరోజూ మెనూలో మార్పులు ఉంటాయని సాహిత్య సమ్మేళన ఆహార కమిటీ అధ్యక్షుడు రమేశ్‌బాబు బండిసిద్దేగౌడ తెలిపారు.

డీఆర్‌డీఓ మునుపటి శాస్త్రవేత్త రామమూర్తికి సత్కారం

బెంగళూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): లాల్‌బాగ్ వాకర్స్ అసోసియేషన్‌తోపాటు చాణక్య యూనివర్సిటీ చాన్స్‌లర్ పద్మశ్రీ గ్రహీత ఎంకే శ్రీధర్‌ల ఆధ్వర్యంలో డీఆర్‌డీఓ మాజీ శాస్త్రవేత్త రామమూర్తిని సత్కరించారు. ఆదివారం హాప్‌కామ్స్ సర్కిల్ ప్రాంతాన్ని పర్యావరణ కూడలిగా పిలవాలని తీర్మానించారు. ఇదే సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పారా అథ్లెటిక్స్‌లకు శిక్షణలు అందించే సీతారాంను సత్కరించారు. లాల్‌బాగ్‌లో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేద్దామని తీర్మానించారు. లాల్‌బాగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ, బలరాంతోపాటు కన్నడ అధ్యాపకుడు రుద్రేశ్ అదరంగి, గుప్త, నాగరాజ్ సహా పలువురు పాల్గొన్నారు. కార్యక్రమంలో హోసూరు నుంచి వాకింగ్ వచ్చిన 22మంది సభ్యులు భాగస్వామ్యులయ్యారు.



లాల్‌బాగ్‌లో రామమూర్తికి సన్మానంలో ఎంకే శ్రీధర్ తదితరులు

ఉల్లి ధరపై రైతుల హర్షం

» 60కేజీల బస్తా రూ.3వేలు



ఎగుమతికి సిద్ధంగా ఉన్న ఉల్లిబస్తాలు

చేళూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తాలూకాలో పండించే ఉల్లికి ఆశించిన ధర లభిస్తుండడంతో రైతులలో హర్షం వ్యక్తం అవుతోంది. స్థానికంగా పండించే ఉల్లిని చెన్నైకు ఎగుమతి చేస్తుంటారు. 60కేజీల బస్తా రూ.3వేలు పలుకుతోంది. హోల్‌సేల్ ధరలో బస్తా ఇదివరకు రూ.2వేలు ఉండేదని, బస్తాకు సుమారు వెయ్యి రూపాయలకుపైగా ధర పలకడం సంతోషంగా ఉందని రైతు కృష్ణారెడ్డి తెలిపారు. సుదీర్ఘకాలం తర్వాత ఉల్లికి మంచి ధర లభిస్తోందన్నారు. ఇటీవల వర్షాలతో దెబ్బతినగా మిగిలిన పంటకు ఆశాజనకంగా రేటు ఉందన్నారు.

సమకాలీన సమస్యలకు కువెంపు కావ్యాల్లో పరిష్కారాలు

బెంగళూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమకాలీన సమస్యలపై ప్రముఖ కన్నడ కవి 'కువెంపు' కావ్యాలలో పరిష్కారాలు ఉన్నాయని ప్రముఖ నాటకకారుడు డాక్టర్ కేవై నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. నగరంలోని ప్రభుత్వ కళాశాలలో కన్నడ సంఘం ఆధ్వర్యంలో కువెంపు, దరా బేంద్రెల జయంతిని ప్రారంభించి మాట్లాడారు. మనుష్యులే కాక చరాచర జీవుల గురించి కావ్యాలు, కథలు, నవలలు, నాటకాలు, మహాకావ్యాలను కువెంపు తమ రచనల్లో సమకాలీన అంశాలను ప్రస్తావించి వాటికి పరిష్కారాలు కూడా సూచించారన్నారు. ప్రపంచీకరణ ద్వారా తలెత్తిన యుద్ధాలు, కులమత బేధాలతో సంఘర్షణల గురించి రచనల్లో ప్రస్తావించారన్నారు. విశ్వమానవతా వాదానికి ఆయన చేసిన రచనలు ఆదర్శమన్నారు. కర్ణాటక రాష్ట్రగీతమైన 'జయభారత జననియ తనుజాతె' రచించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. జ్ఞానపీఠ పురస్కారం, పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారన్నారు. సూలిబెలె ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాల కన్నడ సహ ప్రాధ్యాపకులు డాక్టర్ సంగీత, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కన్నడ ప్రాధ్యాపకుడు డాక్టర్ బిసి నాగేంద్ర కుమార్ ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీటీ శ్రీనివాసనాయక అధ్యక్షత వహించగా కన్నడ సంఘం సంచాలకులు డాక్టర్ రుద్రేశ్ అదరంగి తదితరులు పాల్గొన్నారు.



కువెంపు, బేంద్రె చిత్రపటాలకు పుష్పాంజలి

పారిశుధ్యం.. అధ్వానం..



నీలగిరి తోపులో కోళ్ల వ్యర్థాలు

బంగారపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే దేశ ప్రగతి సాధ్యమనే పరికల్పన కోసం స్వచ్ఛభారత్ మిషన్ పథకం కింద ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంది. అయితే కొన్ని చోట్ల నిర్లక్ష్యం కారణంగా స్వచ్ఛభారత్ పరికల్పన సాకారం కాలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు తాజా ఉదాహరణ బంగారపేట తాలూకా కేతగానహళ్ళి గ్రామ పంచాయతీ పరిధిలోని తావరేకెరె గ్రామంలో స్వచ్ఛత కొరవడింది. గ్రామంలో అధికశాతం వ్యవసాయంపైనే ఆధారపడ్డారు. పలు చోట్ల మురుగుకాలువలలో పూడిక తీయకపోవడం, మాంసం వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ వేయడంతో దుర్గంధం, దోమల బెడద ఉంటోందనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామం నుంచి కనీసం మూడు కిలోమీటర్ల దూరంలో కోళ్లఫారం ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే గ్రామం నుంచి కేవలం 100 మీటర్ల దూరంలోనే ఏర్పాటు చేశారు. వీటికి తోడు కోళ్ళఫారం ప్రదేశంలో స్వచ్ఛత పాటించకపోవడంతో ఈ ప్రదేశం దుర్గంధభరితంగా మారింది. మృతి చెందిన కోళ్లను పెద్ద కుంటలో పడేసి మూయాల్సి ఉంటుంది. అయితే నిబంధనలు పాటించకుండా మృతి చెందినవాటిని చెరువు ప్రదేశంలో లేదా నీలగిరి తోపులో పడేస్తున్నారు. మాంసపు వ్యర్థాలకోసం వీధికుక్కలు తరచూ చెలరేగిపోతుంటాయి. ఇలాంటి సమస్యలకు కోళ్ళఫారం యజమానులు సరైన నిర్వహణ లేక పోవడమే అనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటివాటికి సంబంధించి అధికారులు పర్యవేక్షించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. తాలూకా కేంద్రం బంగారపేట నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉండే తావరేకెరె గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ కూడా సజావుగా లేదు. ఇటీవల కురిసిన వర్షాలతో దోమలబెడద అధికమైందని విచారం వ్యక్తం చేశారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థుడు రమేశ్ డిమాండ్ చేశారు.



మురుగుకాలువ దుస్థితి

దళారుల చేతిలో మోసపోవద్దు

కణేకల్లు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్నో వ్యయ, ప్రయాసలకోర్చి పండించిన ధాన్యాన్ని దళారుల చేతిలో పెట్టి మోసపోవద్దని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ భారతి సొసైటీ వద్ద వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక నుంచి వందలాది మంది దళారులు కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో తిరుగుతూ రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి, ఆ తర్వాత ఐపీ పెట్టే అవకాశం ఉన్నందున రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయిస్తే 48 గంటల్లోనే వారి బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ అవుతుందని ఆయన పేర్కొన్నారు. రైతులు పండించిన ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ. 2320లు, సాధారణ రకానికి రూ. 2300లు ప్రభుత్వం ధరను నిర్ణయించిందన్నారు. అలాగే గోనెసంచులతో పాటు రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్చెల్సీ ఆయకట్టు రైతుల కోసం తాను ప్రత్యేకంగా ప్రభుత్వంతో చర్చించి కణేకల్లులోనూ, బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్టలోనూ వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఐదువేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలుకు అధికారులు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు విప్‌ను సన్మానించి, వరికొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పౌరసరఫరాల శాఖ డీఎం రమేష్‌రెడ్డి, ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ ఫణికుమార్, ఏఓ శ్రావణ్‌కుమార్, స్టాకిస్ట్ సుధాకర్, సొసైటీ అధికారులు సతీష్‌తో పాటు టీడీపీ కన్వీనర్ లాలెప్ప, మాబుసాబ్, చంద్రశేఖర్‌గుప్తా, అనిల్ పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో మంత్రి చలువరాయస్వామి



మంత్రి చలువరాయస్వామికి మొమెంటో అందిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మంత్రాయలం రాఘవేంద్ర స్వామిని వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయస్వామి దర్శించుకున్నారు. వ్యవసాయ మేళాలో పాల్గొనడానికి రాయచూరు వెళ్లిన మంత్రి తిరుగు ప్రయాణంలో స్వామిని దర్శించుకున్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం రాఘవేంద్ర స్వామిని ఆదివారం ప్రముఖులు దర్శించు కున్నారు. కర్ణాటక రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చలువరాయస్వామి, ఏపీ హైకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ న్యాపతి విజయ్, జస్టిస్ మహేశ్వరరావు కుంచెం వేర్వేరు సమయాల్లో రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. శ్రీమఠం మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి లు వీరికి ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షింతలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట మఠం సిబ్బంది అనంతపురాణిక్, జేపీ స్వామి, ఎస్ఐ పరమేష్ నాయక్, వ్యాసరాజాచార్, దేశాయి నరసింహ ఆచార్, ప్రకాష్ ఆచార్, రంగస్వామి, జయతీర్థ ఆచార్ పాల్గొన్నారు.

మొదలైన క్రిస్మస్ సందడి

బెంగళూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలో క్రిస్మస్ సందడి మొదలైంది. నగరంలో ఏటా క్రిస్మస్ వేడుకలు వైభవంగా కొనసాగుతాయి. నగరంలో వందలకొలదీ ప్రాంతాలవారీగా వందల కొలదీ చర్చ్‌లు ఉన్నాయి. ఇప్పటికే చర్చ్‌లలో ఏర్పాట్లు ఆరంభించారు. నగరంలోని చర్చ్‌స్ట్రీట్, ఎంజీ రోడ్డు, కోరమంగల, ఇందిరా నగర్ ప్రాంతాలలో వారాంతంలో క్రిస్మస్ పండుగకు అవసరమైన స్టార్‌లు, ఇతరత్రా వస్తువులు కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపారు.



క్రిస్మస్ స్టార్‌ల విక్రయాలు

13న హనుమద్ వ్రతం



భక్తాంజనేయస్వామి (ఫైల్)

బెంగళూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణం లోని ఆనేకల్‌సత్రంలో ఇష్టార్థసిద్ధి ఉత్తర ముఖి భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమద్ వ్రతం పురస్కరించుకుని ఈనెల 13, 14 తేదీలలో రెండు రోజుల పాటు స్వామివారికి విశేషపూజలు, అన్న దాసోహం, సంగీత కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఆలయ అర్చకులు అనంత్‌కుమార్ మాట్లాడుతూ శుక్రవారం స్వామివారికి అభిషేకం, పుష్పాలంకరణ, మధ్యాహ్నం అన్న దాసోహం ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటలకు పతంజలి యోగశిక్షణ సమితి సరోవర గణపతి భజనామండలి ఆధ్వర్యంలో భక్తిసుధ, ఎల్లమ్మదేవి భజనామండలి ఆధ్వర్యంలో భక్తిగీతాల కార్యక్రమం, వాగ్దేవి విప్రజ మహిళాసంఘం ఆధ్వర్యంలో నాదసుధా దాసగీతాల సంగీత కార్యక్రమం ఉంటాయన్నారు.

సజావుగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు

అనంతపురం విద్య, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వేతన పరీక్షలు (ఎన్ఎంఎంఎస్) ఆదివారం జిల్లాలో సజావుగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు 3665 మంది విద్యార్థులకుగాను 3503 మంది హాజరయ్యారు. కేంద్రాలను పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న పరీక్షల ప్రాథమిక కీ విడుదల అవుతుందన్నారు. ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కార్యాలయ వెబ్ సైట్ www.bse.ap.gov.inలో అందుబాటులో ఉంచుతారన్నారు.

పక్షవాతానికి జీవనశైలే కారణం

బెంగళూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు వయోవృద్ధులకు మాత్రమే తీవ్రమైన ఆరోగ్యసమస్యగా ఉండే పక్షవాతం ఇటీవల యువతకు వచ్చేందుకు జీవనశైలే కారణమని ప్రముఖ వైద్యుడు ధీరజ్ అడిగ అభిప్రాయపడ్డారు. నగరంలో 19ఏళ్ల యువకుడికి పక్షవాతం రాగా సకాలంలో హెచ్‌సిహెచ్ రికవరీ రిహాబిలిటేషన్ సెంటర్‌కు తీసుకొచ్చారన్నారు. అతడికి చికిత్సలు అందించడంతో పూర్తిగా కోలుకున్నాడన్నారు. యువతకు పక్షవాతం వచ్చేందుకు దుర్బలమైన జీవనశైలి, తీవ్రమైన ఒత్తిడి, పరిసరాల ప్రభావం వంటివి కారణాలన్నారు. పక్షవాతంగా గుర్తించిన వెంటనే ఆసుపత్రిలో ఓ మైనరు సర్జరీ ద్వారా నయం చేయవచ్చునన్నారు. హెచ్‌సిహెచ్ సీఈఓ వివేక్ శ్రీవాత్సవ మాట్లాడుతూ పక్షవాతానికి సకాలంలో వైద్యం అందిస్తే దీర్ఘకాల అంగవైకల్యాన్ని నివారించవచ్చునన్నారు.

సందడిగా పెట్ షో

బెంగళూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్యాలెస్ మైదానంలో పెట్‌ఫెడ్ సంస్థ పదో వార్షికోత్సవంలో శునకాల ప్రదర్శన ఆకట్టుకుంది. శని, ఆదివారాలలో సాగిన పెంపుడు జంతువుల ప్రదర్శనలో వివిధ రకాల శునకాలను ప్రదర్శించారు. నటి డినోమోరియా పాల్గొన్నారు. 1500కుపైగా శునకాలు ప్రదర్శనలో పాల్గొనగా రెండురోజుల్లో సుమారు 10వేలమంది సందర్శించారు. పెట్‌ఫెడ్ సంస్థ సంస్థాపకుడు అక్షయ్‌గుప్తా మాట్లాడుతూ బెంగళూరులో నిర్వహించిన ప్రదర్శనకు ప్రజలనుంచి ఉత్తమ స్పందన లభించిందన్నారు. ఇదే స్ఫూర్తితో ఢిల్లీ, పూనె, ముంబైలలో నిర్వహించనున్నట్టు తెలిపారు. శునకాలు, పిల్లలకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.